# విలోకరి

స్వర్ణ

*లేనిపోనివి కల్పించి ప్రచారంచేసే పుణ్యాత్ములకు ఏనాడూ కొరత ఉండదు. అవన్నీ నమ్మేవారు పలువురు. అలాంటి వాళ్ళకు బుద్ధిచెప్పేలా బ్రతకడం నేర్చుకోవాలి. పిరికితనంతో నుయ్యో గొయ్యో మూమకొనడం అవివేకం.*

గోఖలే వ్రాత ముగించలేదు. చిమ్నీ పై భాగమంతా మసి కమ్ముకుపోయి దీపం మబ్బు వెలుతురినిస్తోంది. అర్ధరాత్రి దాటి చాల సమయమయింది. వ్రాస్తున్న ప్రతి అక్షరం నిప్పులు గ్రక్కుతున్నట్టు అతడి ముఖం, ముడిబడ్డ భ్రుకుటి తీక్ష్ణంగా స్ఫురింప జేస్తున్నాయి. కప్పుకున్న దుప్పటి ప్రక్కకుతోసి సీతమ్మగారు ఉద్రేకంగా గోఖలే దగ్గరికంటా వచ్చింది. కళ్ళతో అతడి ముఖంలోనికి వెదికింది. అతడు ఒక చిరునవ్వు వదిలి మళ్ళీ వ్రాతకు ఉపక్రమించేడు.



'ఈ దీపం తీసేస్తా. ఇక నిదురపో నాయనా. ఏవిఁటీ పిచ్చివ్రాతలు వేళాపాళా లేకుండా...'

'కాస్సేపు ఉండనీయమ్మా. అయిదు నిమిషాల్లో ఈ వ్యాసం పూర్తి అయిపోతుంది. రెండు రోజుల్లో పత్రికలో ప్రచురణ కావాలి. తరవాత నువు చెప్పినట్టే వెళ్ళి నిద్రపోతాను.'

'నీ ఆరోగ్యం పాడవుద్ది బాబూ...ఏవిఁటో... చెప్పింది వినవు కదా...' అంటూ నీరసంగా అక్కడినుంచి వెళ్ళిపోయింది సీతమ్మగారు. గోఖలే వ్యాసం ఎప్పుడు ముగించేడో, ఎప్పుడు నిద్రపోయేడో. కిటికీ చువ్వల్లోంచి సూర్యుడు తన కరాలతో గోఖలే వీపు తడుతున్నాడు. లేవ లేదు. సీతమ్మగారు ఒళ్ళు తట్టింది.

'ఇదేమి అలవాటు నాయనా...బొత్తిగా నిద్రాహారాలు లేకుండానా? తొందరగాలే భోజనం చేద్దుగాని...లే...'

'లేస్తున్నానమ్మా. అయితే అయిందిగాని, అమ్మా, రాత్రి మంచి వ్యాసం వ్రాసేను.'

'ఏవిఁటోయ్ నీ వ్రాతలు? మంత్రాలకు చింతకాయలు రాలేటట్టున్నాయ్, రోజులు. నీతి

# 'విలోకరి'

నియమాలు మనుషులకు దున్నపోతు మీద వాన జల్లయిపోయింది. మంచి చెడ్డల వివక్షతకు మమతెక్కడిది మానవుడికి...'

అనుభవ మథనంలో చిలికిన నవనీతంలా అనిపించింది గోఖలేకు.

'మానవులలో మంచి పూర్తిగా చచ్చిపోలేదమ్మా—అదీ మనదేశంలో. నిద్రపోతున్న మంచిని మనిషిలో లేపే మార్గమెక్కటే వెదకాలిగాని...'

గోఖలే ధోరణికి, అతడి మాటల సరళికి కాస్త విస్తుపోయి నిట్టూర్చింది. 'మీ నాన్నగారూ ఇలాగే అనేవారు బాబూ... అదే నీకు అబ్బింది... చివరకు లభించిం దేమిటి?'

'భారతదేశ స్వాతంత్ర్యం అమ్మా.' ఉద్రేకంగా అరిచేడు గోఖలే.

'ఆయన చావుకూడ...' అన్నది రుద్ధమైన కంఠంతో.

దానికి సమాధానం గోఖలే చిరునవ్వు.

బాపన్నగారిని గాంధీ బాపన్నగా రనేవారు. ఆ తాలూకాలో ఉప్పు సత్యాగ్రహంనుండి 1942 ఉద్యమం వరకు ఆయన నడిపిన పోరాటాలు ప్రజల గుండెల్లో ఆయన పేరు చిరస్మరణీయం చేసినవి. ఉన్న ఆస్తంతా పోగొట్టుకున్నాడు. జైళ్ళలో మ్రగ్గేడు. లాఠీ దెబ్బలు తిన్నాడు. కష్టాలన్నీ వరించి స్వాతంత్ర్యోద్యమ ప్రయోక్తగా సర్వసౌఖ్య పరిత్యాగి అయ్యేడు. సీతమ్మగారు ఆయనతో ఉద్యమవనవాసం అనుభవించింది. ఒక్కగాను ఒక్క చిన్నారికి ముద్దుగా అపరనాయకుని ఉద్దేశించి గోఖలే నామకరణం చేసేడు. సీతమ్మ మాతృహృదయంలో బాపన్నగారి దేశభక్తిలో 'కొంత పిచ్చికూడ ఉందేమో'నని అనుమానం కలుగజేసింది. అందుకే 'మన చిన్నారి బ్రతుకెలా చెప్పండి— ఉన్నదంతా ఉద్యమంలో సమిధలైపోతే...' అనేది.

'నా అనేదంతా దేశంకోసం ఈ మహోద్యమంలో సమిధ అయితే, ఆ ప్రతిఫలం చూడగలిగితే అదే ఈ జీవితానికి పరమావధి. స్వతంత్ర భారతంలో ఒక్క గడియ బ్రతికి మరణించడం నా జీవితాశయం...' అని ఆయన ఆత్మలో శంఖారవం పూరించేవాడు. సీతమ్మగారు చప్పగా చూచేది.

'వెర్రిదానా, రవే అస్తమిస్తూంటే, రవి అస్తమించని బ్రిటిష్‌సామ్రాజ్యమేమిటి? వాళ్ళూ అస్తమిస్తారు ఈ దేశంలో' అంటూండేవాడు. ఆ మాటే ఆయన గొంతులో వినిపించేది.

బాపన్నగారు యువకుడుగా సీతానగర ఆశ్రమంలో డా. సుబ్రహ్మణ్యంగారితో ఆశ్రమం నడిపించేడు. ఆయనతో లాఠీ దెబ్బలు తిన్నాడు. సాంబమూర్తితో సత్యాగ్రహాలు చేసేడు. నెత్తురు కారింది లాఠీ దెబ్బలతో. అందరితోనూ జైళ్ల ఊచలవెనక మ్రగ్గేడు. ప్రతి సంవత్సరం స్వాతంత్ర్యోద్యమంలో అరుణరాగం వెల్లివిరుస్తూంది. ప్రజల్లో, నాయకుల్లో ఉత్తేజం పెరిగిపోయింది. 1942 కు నాయకులు వెలిగించిన స్వాతంత్ర్యేచ్ఛ ప్రజ్వరిలించింది. ఉద్రేకించింది. కాశీపట్నంలో కాల్పులు, మచిలీపట్నంలో కాల్పులు, చీరాల పేరాలలో ప్రజ్వలన, ఠాణాల దోపిళ్ళు, రైళ్ళ రాకపోకల ఆటంకాలు, జైళ్ళు కిటకిటమరో ప్రక్క. ప్రతిఊరూ ప్రతిబాటా ప్రజా వెల్లువల ఉద్యమ నినాదాలు. ఆ రోజుల్లోనే గాంధీ బాపన్నగారు కన్నుమూసేరు. 'బ్రిటిష్ సామ్రాజ్యం భారత దేశంలో అస్తమిస్తూంది. ప్రతి భారతీయుడూ సుఖిస్తాడు. ఇది నా దృఢ నమ్మకం...'అని కడవరకూ అంటూ కన్ను మూసేడు.

ప్రజ్ఞాపురం, బాపన్న గారి ఉద్యమ ప్రతిబింబం అని పేరు తెచ్చుకున్నది. గాంధీతాత విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. రామాలయ ఆవరణలో నాయకులు అందరి జయంతులూ జరిపేది; బాపన్నగారి జయంత్యుత్సవం కూడ జరిపేది. ఈమధ్య అవన్నీ మరిచిపోయింది. ప్రభుత్వం కాలెండర్లు జ్ఞాపకం చేస్తున్నవి గనుక నేమో




## డాక్టర్ వృత్తి చేయండి!

ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు పోసల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

INDIAN HOMOEOPATHIC COLLEGE
(A.W.P.) JULLUNDUR CITY




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, విధి విక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేనయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు నాపూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**



సోమస్కందర్ (తిరునేయిలానం) ఫోటో—ఎస్. రామకృష్ణ (మాయురమ్)

అక్టోబరు రెండో తారీఖున మాత్రం ఒక్క జయంతి జరుగుతుంది.

'రవి' పత్రికలో విలేకరి వ్యాసం — 'తిండి దొంగల అక్రమ దోపిడి— లారీల మీదుగా బియ్యం పొరుగు రాష్ట్రాలకు తరలింపు.' తరవాత మూడు రోజులకే సేఠ్ ఖిలూరామ్ అయిదులారీలు సరుకుతో సహా పట్టుబడ్డాయి. ఎట్లాగ? అని కాలుకాలిన పిల్లులు నాలుగు చేరి ముసుగులో గుద్దులాట లాడుతున్నాయి—వీరభద్రం, ఖిలూరామ్, వెంగళ్రావు, పెంటేశ్వర్రావు. గోఖలే చేతుల్లో నాలుగు పుస్తకాలున్నాయి. వెళ్తున్న వాడల్లా కనిపించేడు. వెంగళ్రావు ఒక్క నమస్కారబాణం వేసి 'గోఖలేగారూ... వీరభద్రం పిలుస్తున్నాడండి...' అని గోఖలే దారి మరల్చేడు.

ద్వారాని కెదురుగా గాంధీతాత బోసినవ్వుల బొమ్మ. ఆవలిప్రక్క వీరభద్రం తండ్రి రావు బహద్దర్ బొమ్మ ఉన్నాయి. సోఫామీద ఖాళీగా కూర్చున్నాడు వీరభద్రం. లాల్చీ చేతులు కొంచెం పైకి మడిచి ఉన్నాయి. ఎదురుగా కూర్చున్న పెంటేశ్వర్రావు, ఖిలూరామ్ ముఖాలు ముడుచుకున్నారు. వీరభద్రం అందుకున్నాడు— 'కొంప ముంచితివి గోఖలే...ఖిలూరామ్ గంగలో కలిసేడు...'

గోఖలే 'ఏం' అన్నాడు.

'ఎబ్బే, ఏమీలేదు. పట్టూ విడుపూ ఉండాలి. మంచీ చెడూ ఆలోచించాలి. పత్రికలో అంత హుషారు చేస్తే ఏలాగు? ఎలా బ్రతకమన్నావు' అని ఖిలూరామ్ ముఖంలోకి చూచేడు.

'ఖిలూరామ్ బ్రతుక్కేం? విక్షేపంలా ఇకమంచి బాగా బ్రతకడం నేర్చుకుంటాడులే...వస్తా...' అంటూ వెళ్లిపోయేడు, గోఖలే. పెంటేశ్వర్రావు ముక్కుకున్నాడు. వీరభద్రం దెబ్బతిన్నవాడిలా ముఖం మాడ్చుకున్నాడు. ఖిలూరామ్ తేపికళ్లు వేసేడు.

వెంగళ్రావు—'కళ్లముందు పెరిగిన కుర్రాడి కెంత పెడసరం... ఏం వ్రాతలో ఏమిటో, ఒక్కటే రాకపోయినా...' అని తన ప్రతాపం మీద బేరీజు వేసుకుంటున్నాడు.

'వాళ్లనాన్న మర్యాదను చూచి మరీ ఊరుకో వలసి వస్తోంది. లేకపోతే...' అన్నాడు వీరభద్రం.

'లేకపోతే కాదోయ్... వాణ్ణి అదుపులో పెట్టాలి!' అన్నాడు పెంటేశ్వర్రావు పళ్ళు కొరికి.

విస్తుపోయిన మనస్సు ఉద్రేకానికి అందరూ తలో సిగరట్టూ వెలిగించి పేక ముట్టుకున్నారు. ఆట రసపట్టులో పడింది.

వెంగళ్రావుకేదో హఠాత్తుగా జ్ఞాపకానికొచ్చింది—'విన్నావా వీరభద్రం. కొత్తగా వచ్చిన ఇన్స్పెక్టర్ మరీ అనహ్యంగా కాపలా కాస్తున్నాడోయ్ ఊళ్లో...'

ఖిలూరామ్—'ఏం జరిగిందో చెప్పు బాబూ మళ్ళీ' అన్నట్టు గాభరా పడ్డాడు.

పెంటేశ్వర్రావు దండలమీదికి మడిచిన చొక్కా చేతులు క్రిందికి దించేడు కొంచెం. వీరభద్రం ఆలోచిస్తూ 'చెప్పవోయ్...' అన్నట్టు చూచేడు.

'పాతగుడి అవతల పొదల్లో చతుర్ముఖ పారాయణం సాగిస్తున్నారట కొందరు. వాళ్ళందర్నీ పట్టేసేడట గమ్మత్తుగా... అందులో ఎక్సు మిలిట్రీ సిపాయి లింగం కూడా దొరికేడట...' అంటూ చెప్పుకు పోతున్నాడు వెంగళ్రావు. మధ్యలో అందరూ గందరగోళంగా నవ్వేరు, ఉరిమినట్టు. 'శుంఠలు పనీపాటా మానేసి, ఇల్లూ గుల్లా చేసుకుంటున్నారు. మరీ అలా వదిలేయడంవల్లే దొంగతనా లెక్కువయ్యాయి. భేష్ బాగా పట్టుకున్నాడు...' అన్నాడు భద్రం.

'ఇన్స్పెక్టరు నాతో చెప్పి చేసే డిదంతా. ఇందుకు నేను చాల సహాయం చేసేను. భడవ లంతా గిరుక్కున వలలో పడ్డారు'—చేటంత ముఖం చుట్టూ చేతులు తిప్పుకుంటూ అన్నాడు పెంటేశ్వర్రావు. ఖిలూ వింత సంగీతంలా అందరివైపూ చూచి నవ్వేడు. ఖిలూ తన సంగతి తేల్చమని నొక్కి అడిగేడు భద్రాన్ని. 'వెధవ బోడి లారీలూ నువ్వూనూ చూస్తానన్లే వెళ్దూ...' అన్నాడు భద్రం. చీకటి పడింది.

గోఖలే కూర్చుని తీవ్రంగా పుస్తకం చదువుతున్నాడు. అంతవరకూ కబుర్లు చెప్పిన సీతమ్మగారు ఏదో ఆలోచిస్తూ మంచం మీద కూర్చుంది. లింగం బయట తలుపు దగ్గర నిలబడి ఉన్నాడు. ఏదో బయట సవ్వడి. గోఖలే పుస్తకంలోంచి బయటకు చూచేడు—'లింగం, లోపలికి రా...' అన్నాడు.

లింగం ఒళ్ళంతా ముడుచుకుని చిన్న అడుగులు వేసుకుంటూ లోపలి కంటా వచ్చేడు. నిలబడ్డాడు. సీతమ్మ మాట్లాడకుండా చూస్తోంది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. పుస్తకం మూసి గోఖలే అడిగేడు—'ఏమయింది?...' అని.

'అన్యాయం బాబూ అంతామూ. నేను పొలం నుంచి వస్తుంటే దారిలో ఆటకాడ నిలబడ్డాను. అంతే. అందర్తో నన్నూ పట్టుకు పోయేరు...'

'మరెలా వచ్చేసేవు?'

'అళ్ళు కక్కుర్తి బడ్డారటండి. మా పెద్దన్న ఒదిలించుకొచ్చేడు.'

'మంచి పనే జరిగిందిలే...'

'నీకు సిగ్గు లేదూ? వెధవ పనులూ నువ్వూను. చీమా నెత్తురా...' సీతమ్మగారు చీత్కారంతో చీవాట్లు పెట్టింది.

'మీరేవంటారోనని సగం చచ్చి మరీ ఒచ్చేనండి. నాకు పేకాట రాదండమ్మగోరూ. ఎదవ బతుకు సచ్చే, బతికే, ఇంత అవమానం పాలయింతరవాత. నేనెప్పుడో సావ్వలిసినోణ్నండి. అరకాన్ అడవుల్లో బడి పటాలం పోతందండి. మా కంపెనీవోళ్ళంతా అయిదొందల మందిమి. అందులో దొరలు వందమంది. సాయంత్రానికి మమ్మల్ని ట్రెంచి గోతులు తవ్వమన్నారు. మా పనయింది. కూరేసుకు బోజనం తింటున్నాం. తుపాకి పేలిందెక్కడో. ఏమీ లేదన్నారు. టెంటుల్లో పండుకున్నాము. దొరలు టెంటుల్లో బాగా తాగుతున్నారు. అరుస్తున్నారు. అర్ధరాత్రయిపోయింది. దొరల గోలకి నిద్రట్టలేదు. మళ్ళీ తెల్లారగట్టే తుపాకులు పేలి పొదల్లోంచి సాగొత్తోంది. అంతే. అందరి గుండెల్లో రాళ్ళు పడ్డాయి. బిగులిచ్చేరు. గోతుల్లో కూచున్నాం. అలాగే కూచుండిపోయేం మళ్ళీ రెండు రోజుల

దాకా. చుట్టూ తుపాకులు పేలుతున్నాయి. పొదలో ఎందరున్నారో తెలీదు. ఎవరున్నారో తెలీదు. తానంలేదు. బోజనం లేదు. రంగూనుకి మాసంగతి తెలిసిపోయింది. విమానం మీదొచ్చి రేవను పారేసేరు. మాకు దక్కినయి కొన్నే. అంతా అడివిలోనే పడిపోయేయి. మేకలు గట్రా చెట్లకొమ్మల మీదే వేలాడతున్నాయి. పొదల్లో కెళ్ళి తేడానికి ఎవడున్నాడో నని భయం....'

'లింగం, మీరు యుద్ధం తాగుళ్ళతోనూ, మేకల రేషనుతోనూ, గుండెల్లో భయంతోనూ చేసేరన్నమాట...' పకపకా నవ్వేడు గోఖలే. ఈ మాటలేం బాగుండలేదు వినడానికి. ముఖం విరుచుకుపోయింది. అసలు సంగతి చెప్పనివ్వకుండా బ్రేకు వేసేడేం అని కించబడి మళ్ళీ ప్రారంభించేడు. 'అదివరకే నాలుగులోమాటండి. అయ్యగారు లాఠీ దెబ్బలతో ఒల్లు పొడయి, ఆసుపత్రి పాలయ్యేరని, తరవాత పోయేరని అల్లప్పుడే ఉత్తరం వచ్చిందండి. చిన్నబాబు, అమ్మగారు ఎలాగుంటారోనని ఏడిసి సచ్చేనండి. మమ్మల్ని సేరదీసి మంచిసెడ్డా చూసే మా రాజుని మళ్ళీ చూళ్లేం గదండి. ఆ దుఃఖం మీద ఆదమరుపుగా ఉన్నానని, మా దొర మెడపట్టు గ్గెంటేడండి. అణ్ణే తన్నాలని బుద్దేసింది గాని, ఆడు దొర. మా జమేదారు, పౌజులో దుఃఖమూ గిక్కమూ ఉండకూడదు, ఉంటే యుద్ధమే జరగదన్నాడు. దుఃఖం గొంతుకలోనే కుక్కుకున్నానండి. ఆ తరవాత వారమే అరకాన్ అడివికి ఎళ్ళమని చెప్పేసుకదండి. మూడురోజులుగోతులో ఉన్నాక సుట్టూ జపానోడెవడూ లేడు, లెగిసి ముందుకు పదమన్నారండి. అయితే వంద గజాల్లో వాగు గుంటలో తానాలు జెయ్యండి అన్నారు. దొరలెందుకు ముందు తానాలు జెయ్యరు అన్నాడండి రేవల్లి సామేలు. జపానోడెవడన్నా ఉంటే కాల్చి చంపుతాడేమొ, అందుకు ముందెందుకు పోవాలని భయమేసింది. బాబుగారే పోయేరు. యుద్ధంలో తలిచ్చినోణ్ణే పేణంపోక ఆగుద్దేంటని, ఆలిసెం జేస్తే దొరలక్కోపం వత్తాదని వాగుకుపోయి తానంజేసేం. రెండో జేబీ ఎళ్ళేది సిక్కులోళ్ళు. అందరం తానం జేసి బిళ్ళెట్టుకుని నీళ్ళు తెచ్చేం. ఆనాక దొరలు తానానికి దిగేరు. శణానికి రైఫులు చార్జి *లంకించుకున్నారండి* జపానోళ్ళు. వాగు గుంట పక్కే ఒక చెట్టూ. చెట్టుపైన ఒకడూ, చెట్టు మొదలు ఒకడు. పచ్చగా చెట్లలో కలిసిపోయి, దొరల్ని వరసబెట్టి కాల్చి పోయేరు. అందరూ కప్పల్లాగ అణిగి చచ్చిపోయేరు రక్తపు మడుగులో. ఆళ్ళెల్లిన కొంతసేపటికి మడుగులో దొరల్ని బయటికి లాగేమండి. నా మెడట్టుకుని అల్లప్పుడు గదమాయించిన దొరపేణం నాచేతుల్లోనే పోతంది. నాకు దుఃఖమొచ్చింది. 'మేన్, నా పిల్లలూ, పెళ్ళవూ...' అని హిందీ బాసలో ఒకటే మూలుగు. కొంత 'కృష్ణా, రామా అనుకోవయ్యా...' అన్నానండి. ఆ మూలుగులోనే పేణం పోయిందండి. అప్పుడు నేను సావ

## 'విలోకరి'

లిసినోణ్ణే కదండి. ఇలాటి నీలాపనిందలు మీదేసుకోవలిసొత్తంది ఈ ఎదవ రోజుల్లో...'

సీతమ్మగారు 'అదేనోయ్, మనకూ తెల్లవాళ్ళకూఉన్నతేడా అంతా!' అన్నది. ఆవిడ కళ్ళల్లో మెరుపు కనిపించింది.

స్తబ్దపడిన మనస్సుతో 'నా ప్రాణం అలా దక్కిందన్నట్టు' చూస్తూ నిలబడ్డాడు లింగం.

'తీగ ముట్టితే డొంకంతా రాలినట్టు, ఒక్క మాటెత్తితే యుద్ధం కథలు ఎన్నైనా చెప్పుకొస్తావు. ఇంతకూ పేకాట కంపెనీలో నువ్వు లేవంటావు...'

'పెమాణమండి, నేనునిలబడిచూస్తున్నాను... అంతే...'

'మరి పాయిలూ?... అయినా నువ్వు అలాంటి వాడితో ఎందుకు పోవలిసొచ్చింది?'

'పాయిలా... ఆడొక కిరాయి మనిషండి. ఆడితో నాలుగడుగులు నడబట్టే నా కింత చేటొల్లొచ్చి బడ్డది.'

'మరి జాగ్రత్తగా మసులుకో...'గోఖలే హెచ్చరించేడు.

'ఎంత జాగ్రత్తయినా ఆ వీరభద్రంగారి చేతిలో ఏంమహిమో! ఆరిచెయ్యే అలాంటిదండి...'

'పోనోయ్, జాగ్రత్తగా మసిలినవ్వాళ్ళా నిన్నెవడేం చెయ్యగలడు? వీసనలు నువ్వు చూసుకో...' లింగం సెలవు తీసుకుని వెళ్ళిపోయేడు. పరధ్యానంగాఉన్న సీతమ్మగారిని పిలిచేడు గోఖలే— 'అమ్మా...' అని. వినడానికి దగ్గరగా వచ్చి కూర్చుంది.

'వీరభద్రం ఏం చేస్తున్నాడో తెలుసునా?'

'ఏవిటి, నాయనా, ఏం జరిగింది?'

'లింగం పండించుకుంటున్న బంజర్ని కాజేయించాలనే ప్రయత్నంలో ఉన్నాడు.'

'అదెలా... వాడు ఉత్త అమాయకుడు. మిలిటరీకి వెళ్ళొచ్చినవాడని, పండించుకుంటున్న బంజరు మీద తనకే హక్కని మురిసిపోతున్నాడుగా. ఇంతకాలం నుండి పండించుకున్న వాడినల్లా ఎట్లా తరుముతాడు...'

'లింగానికి హక్కేమిటి? బలమే హక్కని బలవంతంచేసి పీక్కుతిందా మనుకుంటున్నాడు వీరభద్రం. దున్నుకు పండించుకునేవాడిది హక్కనే విషయం అతడి కక్కర్లేదు...'

'వెనకా ముందూ తెలియని వాడిని, వాడి మీదెందుకు పట్టించేడో అర్థంలేక?'

> *అభివృద్ధి నిరోధించేది, పతనానికి దారితీసేది అంతా పాపం; అభివృద్ధికి, సమన్వయానికి దోహదమిచ్చేదంతా పుణ్యం.*
>
> —స్వామి వివేకానంద

'అర్థం ఉండే. బలవంతుడికి పీక్కుతినాలనే ఆశ కలగాలిగాని, వాడు బలహీనుణ్ణీ, అమాయకుణ్ణీ కదూ పట్టుకు తినేది...'

'అది వాడికి తెలియదు.'

'తెలియకే అలా ఉన్నాడు. లింగానికా చైతన్యం ఉంటే ఇంతవరకూ వీరభద్రానికా ఊహే వచ్చే అవకాశం లేదు. స్వాతంత్ర్యం సంపాదించుకున్నాంగాని, దాన్ని నిలబెట్టగలిగే పునాదులు ఇంకా వేసుకోలేకపోతున్నాం. అందుకే ప్రతిక్షణం ఒకళ్ళనొకళ్ళు దోచుకునే మార్గంలో పరుగెత్తుతున్నాం. వ్యక్తిగత దురభిమానం పెరిగిపోయింది. ప్రతి మనిషిలో జాగృతి కావాలి. ఇలాంటి వేల వీరభద్రాలు అణిగే అవకాశం ఉంది. అంతవరకూ ఈ స్వాతంత్ర్యానికి అర్థంలేదు.'

సీతమ్మగారు ఆలోచిస్తూ చూస్తూంది.

'ఇంతకూ లింగం గతేంటి నాయనా?' అని అడిగింది.

గోఖలేలో నిశ్వాసం బలంగా వెడలింది.

• • •

'భూమి నాది యన్నధరణి పక్కున నవ్వురా..' గోఖలే పిచ్చివాడిలా నవ్వుతూ ఆకాశం వైపు చూస్తూ అంటున్నాడు. 'భూమి ఎవడబ్బ సొమ్ము? పండించుకున్నవాడికి ఫలమిస్తుంది. ఫలం పండించుకున్నవాడిది. లింగం పండించుకుంటే భూమి వాడిదే. వాడికి ఎవ్వరూ అన్యాయం చెయ్యలేరు' అంటూ కూర్చొన్నాడు. సీతమ్మగారు నిద్రపోయింది.


గోఖలే వ్రాస్తున్నాడు. తను వ్రాసేది పాత చింతకాయ పచ్చడి. అందరూ ఊక దంపుడుగా అనేది 'దున్నేవాడిదే భూమి'. త్యాగాలు చేసి, స్వాతంత్ర్యం సంపాదించేం. నినాదాలు వినాదాలు గానే ఉండిపోయేయి! స్వాతంత్ర్యం వచ్చినా. ఆచరణకు ఇక ఏ రాజ్యంలో? 'రవి' పత్రికలో విలోకరి ఇదే విపులీకరించేడు.

తెల్లవారింది. లింగం భూమిలో పాయిలు దున్నుతున్నాడు. ఇదేమిటి? అన్నట్టు చూచేడు గోఖలే. 'వీరభద్రంగారి పున్నేన దూడలుదొరికేయి. లింగానికి దుక్కి దున్ని బెడుతున్నాను' అన్నాడు పాయిలు. మరోనాగలి పట్టుకున్న లింగం సంబరపడుతూ చూచేడు. పాయిలు సహాయం పరోక్షంగా వీరభద్రం స్వార్థానికి హారతి కర్పూరమయింది. పాయానికొచ్చిన పాయిలు ఏకు మేకయ్యేడు. రెండు నెలలనాటికి లింగానికి అనుభవ మయింది. పాయిలు సాయుధులతో భూమిని కబ్జాలో పెట్టుకున్నాడు.

బిక్కమొగం వేసిన లింగం, విచారిస్తూ చూస్తున్న సీతమ్మగారు, దీర్ఘంగా ఆలోచిస్తున్న గోఖలే—వాళ్ళ మధ్య నిశ్శబ్ద గంభీరం ఏదో బృహత్తర విషయాన్ని కలియబెట్టి ఆలోచిస్తూంది. గోఖలే ముఖంలో విచిత్రమైన చిరునవ్వు రాలింది. లింగంలో విప్పారవ్వ రాలింది.

'పన్నేం శయ్యమన్నారు. శలవైతే ఈ శణాన్ని

(తరువాయి 47 వ పేజీలో)



వివేకానంద మండపం
ఫోటో—బి. ఎస్. మూర్తిరాజు
(మద్రాసు-17)

## 'విలోకరి'

(12 వ పేజీ తరువాయి)

ఆడి బుర్ర పేల్చేస్తాను.' గొంతు చించుకున్నాడు.

సీతమ్మగారు ఆత్రుతగా 'ఉండవోయ్. ఏమిటా కంగారు? తమ్ముంతో తగవు తీరుతుం దనుకున్నావా? ఊరు గొడ్డుపోయిందా...' అన్నది.

'ఇంకేం ఊరండీ...' లింగం తలబాదుకున్నాడు.

'ఊరుకాదు, ప్రతి ఊరూ..' అని బాధగా గొణిగాడు గోఖలే.

మళ్ళీ గంభీరమైన నిశ్శబ్దం నిండిపోయింది.

'లింగం, దరఖాస్తు వ్రాస్తాను. తహసిల్దారుకు ఇవ్వు. కలెక్టరుకు కూడ చెప్పిచూద్దాం' అన్నాడు గోఖలే. కాని లింగం ముఖంలో ఏదో ప్రతిక్రియ చేసి కసి తీర్చుకోవాలనే ఆశ బాధపెడుతూంది.

'మీరూరుకోండి. ఆళ్ళ పరువుతీసి పంది చేస్తాను. ఆ వీరభద్రంగాడి తల రామకీర్తన పాడిస్తాను...' ఉద్రేకంగా సాగిపోతున్న లింగాన్ని వెనక్కు పిలిచేడు గోఖలే.

'పశుబలం, ధనబలం కాదు ఉండాలిసింది. న్యాయం నీ పట్టు నున్నంతవరకూ నీదే పైచేయి. ఇందుకోసం అన్యాయాన్ని దెబ్బలతో చావగొట్టాలనే ప్రయత్నం నీ ప్రయత్నాన్ని, నిన్నూ మరీ ఊబిలోకి దించటం ఖాయం..' లింగం నీరై నిలబడ్డాడు.

సీతమ్మగారు— 'ఏదీ అఘాయిత్యం తల పెట్టకు బాబూ' అని బుజ్జగిస్తూ లింగానికి చెప్పింది. లింగం తల ఊపేడు మౌనంగా.

కౌరవ సభలా ఉంది కోలాహలం. వీరభద్రం భద్రగజమంతయి కూర్చున్నాడు. వంది మాగధుల్లా చేరిన జనసందోహంలో పొగడ్తలు అగడ్తలందుతున్నాయి, భట్రాజు పాటల్లా. కొందరు ఆవలి గడప దాటగానే వీరభద్రాన్ని కలుషవచనాల ఆచమనం చేస్తూ జారుకుంటున్నారు — ఆశ్రితులు. ఇంతకూ అవ్రక్క పరాక్రమవంతుడూ, బలవంతుడూ అయినా ప్రజా నాయకుడు (దండనాధుడు కాదు) వీరభద్రం కావచ్చు. రేపటి తప్పనిసరి ఎమ్మెల్యే అని దుందుభి మ్రోగింది. తలకాయలు వదిలేసిన జనం వీరభద్రానికున్న భేరీమోతకు గుండెల్లో గుబులు పట్టించుకుని ఎమ్మెల్యే ప్రార్థనకు శ్రుతి వేయడం ప్రారంభించేరు, ఆయన పుట్టిన రోజు మిషతో. అందరూ తలోరకంగా నమస్కారం చేసి వెళ్ళిపోయేరు.

వెంకటేశ్వర్రావు నవ్వుకామెర్లవాడిలా చూస్తున్నాడు. వెంగళ్రావు ఆవులించి చిటికెలు వేస్తున్నాడు. వెంకటేశ్వర్రావు వీరభద్రం బొడ్డు మీద వేలుపెట్టి అడిగేడు—

'నీ కులుకేగాని నా సంగతే మరిచినట్టున్నావు...' ఏడిశావ్ లేవోయ్ అన్నట్టు బెదిరించి చూచేడు భద్రం. వెంకటేశ్వర్రావు లేచే ధోరణిలో ఉన్నాడు, అతడి ముడిబడ్డ ముఖం చూస్తే. భద్రం భుజంమీద చేయివేసి 'పిరికివాళ్ళా పారిపోయేటట్టున్నావ్. నాకో పదివేలు పారేయి. పైపని జేస్తాను' అన్నాడు, విషయం మెల్లిగా మళ్ళించి.

'అయితే ముందు ఇంజనీర్ని తొందరగా వైరు మీద ఇక్కణ్ణించి బదిలీ చేయించు...' అన్నాడు వెంకటేశ్వర్రావు.

'ఆడి బొంద. ఉఫ్ అని ఊదితే మరో ఊరు పోతాడు. పట్నంపోయి అన్ని ఏర్పాట్లూ చేసేను. ఈ పాటికి వాడు శంకరగిరి మన్యానికి బయలుదేరి ఉంటాడు.' విజయోత్సాహంతో నవ్వేడు, భద్రం.

పంపకం తెగిన గజదొంగల్లా కొల్లలుగా నవ్వు గుభేలు మంది. ఈ కోలాహలం మధ్య వెంగళ్రాయుడొక సలహా చెప్పేడు అందరికీ— 'ఆరు మూడైనా, మూడు ఆరైనా, ఏది ఏదైనా భద్రం మాత్రం భద్రంగా ఎమ్మెల్యేకాక తప్పదు.' అందుకుగాను అతగాడు చెయ్యబోయే కార్యక్రమంఅంతా తాషామరపా హాయింపులా కాస్సేపు ఉపన్యాసం దంచి, పిమ్మట ఏతద్ ఎమ్మెల్యే ఎలక్షన్లో సాహిత్య రూపకంలో ప్రచారం ఎలా ఉండాలా అని తలపంకించి ఆలోచించి ఏదో అనబోతున్నాడు. భద్రం అందుకుని, 'నేను ఏ సంస్థకు, ఏ పక్షానికి చెందని పరమ సామాన్యుడనై భగవదాశయంతో బ్రహ్మాండమైన సమాజ నిర్మాణ సంకల్పుడనై నిలబడుతున్నా ఎమ్మెల్యేగా...' అని ఉపన్యాస ధోరణిలో చెప్పుకు పోతున్నాడు.

'నేనూ అదే, అంతా అదే చెప్పబోతున్నాను. షెభాష్..!' అని గొల్లుగా అరిచేడు, వెంగళ్రావు. వెంటనే నిలబడి కాగితం విప్పి—'అంటే మనకు పక్షపాతంలేని, పరతంత్రతకు లొంగని, విజ్ఞతలో సమాజాన్ని నిర్మించే వజ్రంలాంటి హృదయాలతో పని చేస్తామన్నమాట..' అని నాటకంలోలా చదువుతూ, కాగితంలో ముఖం పెట్టి కుడి చెయ్యి ఎగరవేసి, చదవడం ప్రారంభించేడు—

'లెఫ్ట్ రైట్.....లెఫ్ట్ రైట్
రైట్ లెఫ్ట్.... రైట్ లెఫ్ట్
లెఫ్టిస్టు నోరులేని రాజ్యం మీద
రైటిస్టు నిలునొంటికాని రామరాజ్యం.
రైట్ రైట్ రైట్—రైటిస్టు అందలాన అసిధారా వర్కను
లెఫ్ట్ లెఫ్ట్ లెఫ్ట్...లెఫ్టిస్టు పంచివేయునవాలు కొంతైనా కాయునేమో ప్రజాస్వామ్య రివాజు...
మధ్యేస్టు....'

భద్రానికెందుకో ఒళ్ళు మండింది. అరిచేడు. వెంగళ్రావు నోరు కరుచుకున్నాడు. ఎదురుగుండా నల్ల మొద్దులా నిలబడ్డ సంగయ్య ఆ ఊళ్లో మధ్యేస్టు (దొంగమద్యం తయారీదారు). చిరునవ్వుతో భద్రం ఆహ్వానించేడు. సంగయ్య మెడ గోక్కుంటూ నీళ్ళు నములుతున్నాడు.

'కొత్తదొర. వాడికేం తెలుసులే? నచ్చజెప్పి నయంజేస్తా. మరిచిపోయేను. ఎలక్షన్లొస్తున్నాయి మరి...' భద్రం కన్నువాటుగా సంగయ్యతో అంటున్నాడు. సంగయ్య వంగి నవ్వుతో రెండు నోట్ల కట్టలు అందించేడు భద్రానికి.

అంతవరకూ వాగిన వెంగళ్రావు పెదాలార్పుకుంటూ కుక్కపిల్లలా కూర్చున్నాడు. భద్రం కళ్ళు చింత నిప్పుల్లా ఎగిరి చూచేయి. వెంకటేశ్వర్రావు చిరునవ్వు మధ్యలో ఆపేసేడు. వెంగళ్రావు కుక్కపిల్లలా మెడ దించేసేడు. జాలిగా మెడమీద చేయివేసి భద్రం—'కాఫీ తాగవోయి కవి కుమారా!' అంటూ వెంగళ్రావు జేబులో రూపాయి బిళ్ల వేసేడు. వెంగళ్రావు ఎగిరి

### విజ్ఞప్తి.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం కథలు, గేయాలు, ఫోటోలు, చిత్రాలు మున్నగునవి పంపేవారు పేరు, పూర్తి చిరునామా స్పష్టంగా వ్రాయవలసి ఉన్నది. ప్రచురణకు అంగీకరించే పక్షంలో ఆసంగతి తెలియపరచడము, ప్రచురణార్హం కాకపోతే త్రిప్పి పంపడము దుస్తరం అవుతున్న కారణంచేత ప్రత్యేకంగా ఈ విజ్ఞప్తి స్తున్నాము.*

—ఎడిటర్

గంతేసేడు ఆవలికి.

వెంకటేశ్వర్రావు నౌకరు రొప్పుతూ అక్కడకు వచ్చేడు. 'ఇంజనీరుగారు రమ్మన్నారండి. ఎవరో పెద్ద దొరొచ్చేడంట, మన రోడ్డు చూడ్డానికి. అప్పుడే పన్నెండు మైళ్ల రోడ్డు చూశారంటండి...' ఆత్రుతగా చెప్పేడు. వెంకటేశ్వర్రావు ముఖం ముడిపడింది, ఎర్రగా. భద్రం సరే వెళ్ళి రమ్మన్నట్టు చూసేడు.

వెంకటేశ్వర్రావు, ప్రజాభీష్టాన్ని మన్నించి ప్రభుత్వం మంజూరు చేసిన ఇరవై మైళ్ళ సిమ్మెంటు రోడ్డు తన కంట్రాక్టు వ్యాపారంలో చాల విలువయిందని పేరు. కాని అది మట్టి రోడ్డుతో సమానమయిందని ఋజువయింది. అభ్యర్థన లిప్పించి పై అధికారిని తీసుకు వచ్చిన గోఖలే పెద్ద ఇంజనీరుతో నడుస్తున్నాడు. వెంకటేశ్వర్రావు ఎదురయ్యేడు. ప్రాణం విలువునా పోయినంత పనయింది. గోఖలే తోకచుక్కలా కనిపించేడు. ఆ రోజు ఎంక్వయిరీ జరిగింది. 'నా కూటిలో మన్నుపోసేడు గోఖలే' అని విలపించేడు వెంకటేశ్వర్రావు. ఆ రోజు తన పని వాళ్ళందరి మీదా విరుచుకు పడ్డాడు. మేస్త్రీలందర్నీ నోటికొచ్చినవన్నీ తిట్టేడు కసితీరా. చిన్నచిన్న ప్రభుత్వ తాబేదారులందరికీ పెట్టిన వంజాడంతా వృధా అయిందని విసుక్కున్నాడు. వాళ్ళనందర్నీ 'నన్నింత మోసం చేస్తారా' అని విదిలించుకున్నాడు. ఏమైతేనేం, ఆ కంట్రాక్టు తనకొంప దీసింది. వీరభద్రం ఓటమికి, చచ్చుదనానికి ఇదొక తార్కాణమని వెంకటేశ్వర్రావు హెచ్చరించాడు. వీరభద్రం తల వెర్రిగా తిరిగింది. తీరా ఎన్నికలు దగ్గరికొచ్చేకొద్దీ జనం ఒక్కొక్కళ్ళే తప్పుకుని పాత ఎమ్మెల్యే గొడుగు క్రిందికి చేరతారేమోనని, తన బలం పోతున్నట్టు క్రుంగి పోయేడు. వెంగళ్రావును, ఇలూరావ్‌ను, వెంకటేశ్వర్రావును పిలిచి ఆరోజు రాత్రి దర్బారు తీర్చేడు. అందులో తన ఎత్తుగడల నడక అంతా అందరికీ విపులంగా వివరించేడు. అందరికీ నాలుగు డబ్బులు దొరికే వ్యవహారాలు ప్రభుత్వం ద్వారా చేయిస్తానని వాగ్దానం చేసేడు.

గోఖలేను ఏం చెయ్యాలని వెంకటేశ్వర్రావొక ప్రతిపాదన పెట్టేడు. భద్రానికి గోఖలేను ఎలా అదుపులో పెట్టుకోవాలో అర్థంకాకుండా ఉన్నది. వెంకటేశ్వర్రావు దుడుకుతనం హెచ్చింది. అయినా ఎలక్షన్ల తరవాత తాను తిరిగి అధికారంలోకి వచ్చిన మీదట చెయ్యగలిగింది చాల ఉంది. ఇప్పుడు చెయ్యి చేసుకుంటే మొదలంట మోసపోతామని విన్నవించుకున్నాడు. వెంకటేశ్వర్రావుకు నచ్చినట్టు లేదు.

భద్రం మరుసటి రోజు రాజధాని నగరం చేరుకున్నాడు. గోఖలే, లింగం ద్వారా ఇప్పించిన అభ్యర్థన పరాకాష్ఠ అందుకుంది. విధం తప్పినా ఫలితం దక్కేటట్టు లేదు భద్రానికి. ప్రభుత్వంతో తాసిల్దార్, కలెక్టర్ల రిపోర్టుల మీద జరిగిన

## 'విలేకరి'

తర్జన భర్జన మీద సాయిలు చేత తాను ఆక్రమింపజేసుకున్న భూమి కాస్తా దక్కకపోడం సరికదా తన పరువు పోతుందనే భయం ఆవేశించింది. తెలిసిన ప్రతి ఉద్యోగి దగ్గర తనకు తోచిన అబద్ధాలన్నీ చెప్పేడు, తన వాదన నెగ్గించుకుందుకు.

సాయిలు భూమిలేని వాడని, వాడి భూమి అన్యాయంగా, ఒక రాజకీయ బాధితుని కొడుకుకు కలిసి వస్తుందని, మరొకడి చేత ఇలాంటి అన్యాయానికి తలపెట్టేరని, సాయిలు అక్షరాలా రాజకీయ బాధితుడని అన్ని జిల్లా సంఘాల నుండి సర్టిఫికేట్లున్నాయని కొన్ని కల్పనలు పుట్టించేడు. తిరిగి క్రింది రిపోర్టులు జాగ్రత్తగా తెప్పించమన్నాడు. విషయాన్ని ముందుకు తోసి, జాప్యంచేసి, తాను ఎమ్మెల్యే అయిన తరవాత తనకు వీలుగా చేసుకోవాలని ఆలోచించేడు. దొరికిన మంత్రినల్లా చూసేడు. తాను వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవగలిగేది, మీదట తాను ఒక్కొక్క మంత్రికి ఎంతవరకు సహాయం చేయగలిగేది, చెప్పిచెప్పి మొత్తుకున్నాడు. కాని ఒక్క మంత్రీ తన మాటలు మామూలుగానే విన్నట్టుగా కనిపించింది. పట్టించుకున్నట్టు లేదు. తేనెపూసిన కత్తిలా ఉన్నట్టనిపించింది. అయినా ప్రజ్ఞాపురంలో చెయ్యవలసిన పనులు చాల ఉన్నాయని,స్కూలు, రోడ్లు, బావులు, చెరువులు అనేక పనులు సత్వరం కల్పించాలని వందల కొద్దీ వ్రేలిముద్రలతో, తన ప్రజాప్రాతినిధ్యం అంతా ఒలకబోసి ప్రయత్నించేడు. కొన్ని జరిగేటట్టున్నాయి. కొన్ని జరగనట్టున్నాయి. ఇంటి దిక్కు పట్టేటప్పటికి ఒక్కటీ జరుగుతుందో లేదో అనేకలగా ఉన్నది.

ఊళ్లో అడుగు పెట్టేడో లేదో, ఆ ప్రాంతం ఎమ్మెల్యే జీపులో ఇంజనీర్లతో సహా వచ్చి చేయవలసిన పనుల గురించి విచారిస్తున్నాడు. 'వీడెక్కడ దొరికాడురా పగటి చుక్కలా' అని తప్పుకుని జారుకున్నాడు. ఆమరుసటిరోజు అందరితో ఆఫీసర్లనందర్నీ తనే పంపించేనని మాత్రం చెప్పుకున్నాడు.

సీతమ్మగారు బలవంతంగా కళ్ళజోడునుండి చూస్తూ పుస్తకం చదువుతూంది.

'నమస్కారమండి...'

'ఎవరూ... నువ్వటమ్మా శారదా.. రాకూర్చో' అని సీతమ్మగారు శారదను చాపమీద కూర్చోమంది.

శంఖం లాంటి కంఠంమీద కోలముఖం ఖిన్నపడి ఉండటం కొంత గ్రహించి, 'ఏమమ్మా అలా ఉన్నావు...' అన్నది.

'ఈ ఊళ్లోనుండివెళ్ళిపోదామని అనుకొంటున్నానండి.'

'ఏం జరిగిందీ?' అన్నట్లు చూచింది సీతమ్మగారు.

ఆమె మౌనంలో కొంత బాధ వ్యక్తమవుతూంది. కళ్ళు ఎర్రబడ్డాయి. సీతమ్మగారు జాలిగా దగ్గరకు తీసుకుంది. శారద కంట నీళ్ళు జారేయి. శారద క్రొత్తగా ఆ ఊళ్లో ఉపాధ్యాయినిగా చేరింది. ముండ్ల కంపగా బాధ పడుతూంది,ఆ ఊరు పరిస్థితిచూచి. సీతమ్మగారు తప్ప మరొకరు ఆమెకు ఆ ఊళ్లో హృదయం విప్పి చెప్పుకొనే వ్యక్తిలేదు. తాను వచ్చినది కొద్ది రోజుల క్రితమే అయినా సీతమ్మగారి దగ్గర ఆత్మీయత నందుకుంది. సీతమ్మగారు శారదను ఓదార్చింది.

'ఏం తెలుసు నమ్మా జ్ఞానంలేని వాళ్ళు... వాళ్ళ వెక్కిరింతలకు వాగుళ్ళకు లెక్కజేస్తే సాగేదేంటి? అయినా చూడమ్మా మనకూ మిగత వాళ్ళు తెలుసుకునేంతవరకూ కొంత ఓర్పు ఉండాలి. ఏమంటావు..' అంటూంది సీతమ్మగారు.

అనుకోకుండా రత్నమ్మ వచ్చి, ఆ పట్టాన అలాగే ఆగిపోయి, వెనక్కువెళ్ళి పోవాలని ప్రయత్నించింది. శారద కోపంకొద్దీ 'ఏమండీ...మిమ్మల్ని ఏం చేసేనని, నా దారిన నేను పోతుంటే నొక్కుకుని నోటికొచ్చిన మాట అంటారు...'అన్నది.

రత్నమ్మ మాట్లాళ్లేదు క్షణం. మాట మలుపుకుంటూ 'నేనేమన్నానండి. లక్ష్మీ వాళ్ళూ ఏదో అనుకుంటున్నారు, ఈ పంతులమ్మ ఎవరా అని...అంతే' అన్నది.

సీతమ్మకు అర్థమయింది.

'ఒసేయ్ రత్నం, మీ పిల్లను చదివించి డాక్టర్ని జేస్తామ, అందల మెక్కిస్తానన్న దానివి, దాని పంతులమ్మను కాస్తా అవమానిస్తావుటే? సిగ్గూలజ్జా లేదు. తెలిసిన వాళ్ళ దగ్గర నాలుగు నేర్చుకోవడం చేతకాక...' అంటూ నాలుగు పట్టే దులిపేసింది. అప్పటికే జారుకున్న రత్నమ్మ, 'నేను కాదు సీతమ్మ పిన్నీ... అందరూ ఉత్తుత్త కబుర్లు చెబుతుంటే నేనే నాలుగు చీవాట్లు పెట్టేను' అని పాఠం నేర్చుకున్న రత్నమ్మ మెల్లిగా వెళ్ళిపోయింది. 'చూశావా, శారదా, తెలియని వాళ్ళతో ఏమీ పట్టించుకో కూడదు. తెలిసిన వాళ్లు ఎవరంటారు గనుక? రత్నమ్మ కామాత్రం చెప్పేవాళ్ళుంటే, ఆడపిల్లను మరో ఆడది ఎట్లా అనేది చెప్పు. ఈ అజ్ఞానం చూచి చదువుకున్నదానివి నువు కంట తడి పెట్టడం వెర్రితనం కదూ...' సీతమ్మగారి మాటలు వింటూంటే తనూ ఏదో కొత్త విషయాలు నేర్చుకుంటున్నట్టు మనస్సులో సంతోష

*దయతో ఇతరులకు మేలు చేయడం మంచిది. కాని భగవంతుడు ఆదేశించినట్లుగా మానవసేవ చేయడం ఉత్తమం.*

—స్వామి వివేకానంద

పడింది. ఆమె పాదాలకు మొక్కాలనే గౌరవం, మమత స్పందించేయి. పసిపిల్లలా కళ్ళు నులుముకుంది. చిరునవ్వు వెలిగించింది. ఆ క్షణంలో సీతమ్మగారి దగ్గర అపరిమితమైన చనువు సంతరించింది.

'ఇంత ఎదిగినా బంతిమొక్కలు పూలే పూయడంలేదేమండి...' నేలమీద చేయివేసి మొక్కల్ని చూస్తూ అన్నది శారద. 'అంత ఓపిక నాకెక్కడిది? మొక్కలు పెంచడమంటే సరదా పడేవాళ్ళంతా తప్పని సరిగా మంచివాళ్ళే అనేవారు ఆయన. అదేం కొలతబద్దో మనిషి మంచితనానికి..' అంటూ వస్తున్న సీతమ్మకు శారద మొక్కలకు నీళ్ళుపోస్తూ కనిపించింది. ఆప్యాయంగా చూచి నవ్వింది.

ఎంత చెప్పినా వినాలనే ఉంటుంది సీతమ్మగారి మాటలు. ఆవిడ దగ్గరనే కూర్చుండిపోయింది శారద చాలసేపు, పుస్తకాలు తిరగేస్తూ. పుస్తకాలైతే ఇంపుగానే ఉన్నాయి. కాని అవన్నీ రాజకీయాలు, ఆర్థికశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలుకావడంవల్ల 'ఏమండీ, మచ్చుకొక మంచి నవలన్నా లేదు' అన్నది శారద.

'అవన్నీ వాడు పెట్టెలో భద్రంగా దాచుకుంటాడు. ఈ పుస్తకాలయితే పైన పడేసినా ఉంటాయి. నవలలు బయటపారేస్తే, చూచిన వాళ్ళంతా అడిగి తీసుకెళ్తారు. మళ్ళీ ఇచ్చే వాళ్ళు లేరు' అంది సీతమ్మగారు. అందుకనే కాబోలు నవలలు లోపల పెట్టేరని ఊహించింది శారద.

కాని బల్లమీద కాగితం కనిపించింది. తీసి వరుసగా చదువ నారంభించింది—

రాజ్యం భోజ్యంచేసే రాగులు ఒకవైపు.
ఊహలతో ఊళ్ళేలే ఓగులొక్కవైపు.
జాతి సంస్కృతి వికాస మెప్పుడు.
సర్వజనుల కడుపుమంట చల్లారిన యపుడు...

చదువుతూంటే చాలాఉత్సాహంగాఉన్నది.ఆలోచించ బుద్ధయింది. ఆలోచిస్తూంటే చాల సంతోషమయింది. ఇంతమంచి ఆలోచనలు గలిగిన మూర్తిని చూడాలనే ఉత్సాహం ఇనుమడించింది. వినడమే గాని దగ్గరసా ఎప్పుడూ చూడలేదని భ్రమతో మనస్సు బాధపడింది.

చీకటిపడుతూంది. 'మా అమ్మ ఎదురు చూస్తూ ఉంటుంది. వెళ్తానండి' అని లేచింది.

లింగం గోఖలేను జెబ్బమీద జెబ్బవేసి, మెల్లిగా నడుస్తూ లోపలికి తీసుకు వస్తున్నాడు. శారద ఆగిపోయింది. సీతమ్మ నిస్తపోయింది. గోఖలేను మంచంమీద పడుకోబెట్టి—

'ఆ సాయిలు ఎదవ లేడండీ, ఆడు బాబుగారు నేను పక్కమ్మటే వత్తుంటే ఎనకమాలిన కఱ్ఱతో కొట్టేడండి. ఇంకా నయం. కొంతలో తప్పి భుజంమీద పడింది. అణ్ణే కాళ్ళమీద బడితకొద్దీ బాదేను. ఆడి రకతం జాత్తా నియ్యాల.... పారిపోయేరు సన్నాసులు...'అన్నాడు.

మంచంమీద పండుకున్న గోఖలేబాధ అనుభవిస్తూ 'లింగం....ఆగు!' అన్నాడు. సీతమ్మగారు కోపంతో 'వాణ్ణిటు పిలువ్వోయ్. అడుగుతా'నంది.

'దీనికి కారణం సాయిలు కాదు. వాణ్ణి అడిగి ప్రయోజనం లేదు. వాడు మూర్ఖుడు. లింగం పోతే వాడూ వీడూ తన్నుకోవడం తప్ప జరిగేదేం లేదు.'

'ఊరుకోండి. నన్నిలాగే అపుజేస్తున్నారు. ఇంత నెత్తికెక్కి పోయేరు.'

'ఆగవోయ్' గోఖలే అరిచేడు.

సీతమ్మ సపర్యలు చేస్తూంది. శారద చక్కబెడుతూంది. ఆసరాగా ఉంది. శారదలో గోఖలే బాధ మూలుగు కలిచివేస్తున్నాయి. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ఏడవా లనిపించింది. క్షణంలో తనకింత బాధ ఎందుకు కలగాలో అర్థం కాలేదు. ఎందుకింత అనురక్తి ఏర్పడింది? సీతమ్మగారి చనువుకొద్దీనా? అన్యాయం మీద అసహ్యమా? లేక నిజంగా గోఖలే, అతని వ్యక్తిత్వం మీద గల అనురక్తా? మరేంటో.... ఈ ఆలోచనావేగంలో రక్తం వేడిగా ప్రవహిస్తూంది. గుండె వేగంగా కొట్టుకుంటూంది. ఆలోచనలవేగంలో పని తత్తరపాటు అవుతూంది. ఒళ్ళు సిగ్గుతెచ్చుకుంటూందేమోనని బిడియపడుతూ ఉంది.

రాత్రి అయింది. గోఖలే మూలుగుతూనే ఉన్నాడు, మంచంమీదనుండి. 'అమ్మా, వారి నెందుకిలా కష్టపెడుతున్నావ్...' అన్నాడు శారద నుద్దేశించి. ఆ మాటతో శారదలో ఏదో ఉత్సాహం రెచ్చినట్లయి, సంతోషమయింది. అక్కడే ఉండా లని బుద్ధి పుట్టింది. కాని తనెందుకని, రాత్రి కూడా కూర్చోవాలి? ఏమీ అర్థం కాలేదు.

'లింగం, ఇంటికి దిగబెట్టిరా...' అన్నాడు గోఖలే.

'వస్తా...' అని సీతమ్మగారితో చెప్పి బయలుదేరింది.

దారిలో సీతమ్మగారి గురించి, గోఖలేగురించి చాలా విషయాలు అడగాలని ఉద్రేక పడింది. కాని అతడేమనుకుంటాడోనని భయం దోబూచులాడుతూంది.

'ఆయన్ని ఎందుకు కొట్టేరు...' అనుకోకుండా అడిగింది.

'అదంతా కత లెండి. ఈ ఊళ్లో భద్రం, వెంటేశు, ఎంగళ్రావు—ఈళ్ళు ఆడిందే ఆటనుకుంటున్నారు. కాని బాబుగారు వన్నెత్తి ఒక్క మాట పలకడు. వాళ్ల ఊసెత్తడు. అంతా కాయితంమీదే. రోజా పత్రిక్కి రాత్తుంటారు. ఆయన దగ్గర చదువుకున్న కూత పాటు చదువుతోటె నడువుతుంటే మా బాగుంటాదండి. నిజానికి నిజం, అబద్దానికి అబద్దం అరటిపండొలిచినట్టు రాత్తారండి. ఆళ్ల సెద్దపనులన్నీ ఒక పక్క కట్టడతున్నాయని.' పళ్ళనొక్కిపటి ఇంకా ఏదో అనబోతున్నాడు.

> దేవునిపట్ల నమ్మకం లేనివాడు నాస్తికుడని ప్రాచీనమతాలు చెప్పినవి. ఆత్మవిశ్వాసం లేనివాడు నాస్తికుడని కొత్తమతం చెప్పుతున్నది. —స్వామి వివేకానంద

'సరేలే, లింగం, ఆయన్ని కాస్త బాగా చూస్తుండు. నేను వెళ్తాను...' అని తొందరగా ఇంట్లోకి నడిచింది.

అనుకోకుండా లింగం భూ సమస్య ప్రభుత్వాన్ని దాటి హైకోర్టు వరకూ వెళ్లింది. గోఖలే తన శాయశక్తులా తుదివరకూ పోరాడ్డానికి సిద్ధపడ్డాడు. ఇందుకు తన స్నేహితులు సత్యం, రామచంద్రం హైకోర్టులో వకాలతు తీసుకుని కూలంకషంగా విచారణ జరిపించేరు. సాయిలు రాజకీయ బాధితుడు కాదని నిర్ణయమయింది. లింగం పండించుకొంటున్న భూమి శివాయి జమాగా గుర్తించేరు. అన్నిటికంటె ముఖ్యం శివాయి జమీందారుకు రాజకీయ బాధితునికంటే ఎక్కువ హక్కున్నదని నిర్ణయం జరిగింది. పరోక్షంగా 'దున్నేవాడిదే భూమి' అనే సిద్ధాంతానికి ఆచరణయోగ్యంగా నిర్ధారణ జరిగింది. భద్రం మొగం ఆలుచిప్ప అయింది. ఆ విజయం గోఖలేదే. తాను వ్రాసిన వ్యాసం తిరిగి తిరిగి చదువుకున్నాడు. హైకోర్టు జడ్జిమెంటు తనివితీరా చదివేడు. గుండెలు సరవళ్ళు తొక్కాయి.

'చూశావా, లింగం, ఆరోజు కంగారుపడ్డావు. న్యాయం కొందరు చీకటికొట్లలో బంధించగలిగే వస్తువు కాదు. కాని అన్యాయాన్ని దాని వెనక ఉన్న మనుషుల్ని వెలుతురులో నిలబెట్టగలిగే చైతన్యమే మనకు కావాలి. మనం నిద్రపోతే మనచుట్టూ చీకటి పహారా ఇస్తుంటుంది. చీకటి పహరాల్లో సుషుప్తిలో చచ్చినవాళ్ళలా పడుంటే, మనం అనుభవించే దేశస్వాతంత్ర్యం దాని అర్థమేమిటి...' ఉద్రేకంగా ఆత్మశంఖారావం చేసినట్లు అంటున్నాడు.

'వాడికి ఏమాత్ర మర్థమయిందో? లేకపోతే బడిత పట్టుకు బయలుదేరుతాడూ...' అంది సీతమ్మగారు.

'అబ్బే లేదమ్మగోరూ... అల్లాంటి పనులు సెయ్యను. అయ్యగారి సలా మంచిదండి...'

'అట్లాగాదు లింగం. నీకు నువ్వు పెద్దవాళ్ల ఎత్తుగడలు తెలుసుకోగలగాలి. అందులో ఉత్సాహం ఉండాలి. అందరిలో అదే ప్రజ్వలింపజేయాలి. ప్రతి మనిషీ మేలుకొని అన్యాయపు చీకట్లకు తావీయకూడదు. అంతవరకూ జాగ్రతితో నడవలేకపోతే, మనం స్వాతంత్ర్యానికి అర్హులం కాము...'

ఆ రోజు చాలా సంతోషంగా గడిచిపోయింది.

వెంగళ్రావు ఏదో మాట చెప్పాలని ఉబ్బిపోతున్నాడు. భద్రం, వెంటేశ్వర్రావు ఆలోచిస్తున్నారు, గ్రామంలో ఏ పనులు చేయించాలి,

ఆ పనులు తమ పరంగా ఎట్లా చేయించుకొని ఉభయతారకమైన పేరు సంపాదించాలీ అని. బి. డి. ఓ. ను బుట్టలో వెయ్యాలి. రెవెన్యూ వాళ్ళను చేతుల్లో పెట్టుకోవాలి—ఇదీ ఆలోచన. ఏ దారి వెదికినా గోఖలే ఎదురవుతున్నాడు. తల గోక్కోవలసి వస్తూంది. పెంటేశ్వర్రావు—'మీ ఇష్టం. ఎలా చేసుకున్నా నా కేమీ అక్కర్లేదు....' తామరాకుమీద నీటి బొట్టులా బొత్తిగా బాధ్యతలేనివాళ్ళా అంటున్నాడు. భద్రానికి బాధ కలిగింది. ఏదో పార్టీవాళ్ళు తాను నిలబడితే ఏభై వేలు ఇస్తామని పెంటేశ్వర్రావుతో రాయబారం జరుపుతున్నారని కర్ణాకర్ణిగా విన్నమాట నిజమని సూటిగా తాకింది భద్రానికి. ఇక తన కేగతీ కనిపించడం లేదు గనక, ఆ పార్టీవాళ్ళనే తానూ గట్టిగా లోపాయికారిగా బేరం బెట్టుకుంటే చాల మంచిదనే ఆలోచనలతో తల దిమ్మెక్కిపోతూంది.

పెంటేశ్వర్రావు 'ఎలక్షనుకు కొత్త పాట వ్రాసేవేంటి. ధుమాగా ఉండాలి. చదువు' అన్నాడు. అనడమే తరవాయి చదవడం ప్రారంభించేడు వెంగళ్రావు—

'ఓ భువన సుందరి
ఓ జఘన సుందరి
కనిపించేవా అప్సర
లీలా శిరోజ చాలన స్నిగ్ధ
ఓ అందాల మిన్న, భువిలో అందరికీ మిన్న
శాకుంతలకన్న, సౌందర్యలహరికన్నా.....'

భద్రం ముక్కుకున్నాడు. పెంటేశ్వర్రావు ముఖం తిప్పి 'నా పేరు పెట్టి ఎలక్షను పాట వ్రాస్తానన్నావు ఏది?' అని అడిగేడు.

'ఏవిటోయ్ నువు పాడేది...' ముక్కుకున్నాడు ఇద్దర్నీ చూచి భద్రం.

'ఇదంతా కవి హృదయంలో అందమైన అనుభూతి.....'

'ఏవిటయ్యా వాగేది? కప్పిస్తే అటు, కప్పు స్వర ఇస్తే ఇటు వ్రాసే కవిరాయళ్ళతో పడి చస్తున్నాం. నిన్న నాకు ఎన్నిపాటలు రాసి పెడతానన్నావ్...' కోపంకొద్దీ కక్కేడు పెంటేశ్వర్రావు.

'అది కాదు నాయకోత్తమా. ఇది నిజంగా నా అనుభూతి. ఈ రోజు చూచిన అందంలో కొత్తదనం మెరిసిపోయింది. నన్ను కలిచివేసింది. ఊహకన్నా పరుగెత్తేది మరేదన్నా ఉంటే, ఆ అందాల లోతులు వెదికి తేగల సమర్థత, యూరీ గగరిన్‌కంటె ఎక్కువ పుట్టుకొస్తూంది. .....ఇంకా....'

'ఏమిటా వాగుడు....తెలిసేటట్టు చెప్పి ఏడు.' మరీ విసుక్కున్నాడు పెంటేశ్వర్రావు.

'అదికాదు. మన ఊళ్ళో శారద అనే పంతులమ్మ కొత్తగా వచ్చింది చూచేరో లేదో....' భద్రం, పెంటేశ్వర్రావుల కళ్ళల్లో వెలుగు కనిపించింది. మాకు తెలుసు నన్నట్లు కళ్ళు మిటకరించేయి. నోళ్ళు చప్పరించేయి. వెంగళ్రావు వాళ్ళ ఆత్మలను అలా నిలబెట్టి అందుకున్నాడు—


'ఎత్తే ఏమంత విశేషం కాదు. ఆ పూర్వ చరిత్రంతా మనకు తెలుసుగా. అమ్మా, అబ్బా సరిగ్గా తెలీదట. ఉన్నది తల్లో కాదో ఎవడికి తెలుసు...' అంటూ వెకిలిగా నవ్వేడు.

## 'విలోకరి'

భద్రం ఆశకు దీర్ఘాలు తిరిగేయి. పెంటేశ్వర్రావును తప్పించాలనే ఉద్దేశ్యంతో 'ఏమి గొడవో ఏమిటో, రేపు కలుద్దాం' అని లేచేడు. వెంగళ్రావు బిక్కమొగం వేసేడు. పెంటేశ్వర్రావు దారి పట్టేడు. వెంగళ్రావునువెనక్కు పిలిపించేడు.

భద్రం ఒళ్ళు పరవళ్ళు తొక్కుతూంది. ఊగిసలాడుతున్న ఆలోచనలతో పచారాలు తిరిగేడు గదంతా. ప్రొద్దు గూకింది. అసుర సంధ్య మధ్య సూర్యుడు రక్తం పులుముకుని అస్తమిస్తున్నాడు. నింగి నిండుతున్న చీకటిమధ్య ఒక్కొక్క తార ఆకాశ రంగంమీదికివచ్చి మిణుకు మిణుకుమని నాట్యం చేస్తున్నాయి. ఊరంతా సద్దు మణిగింది. చీకటిలో పచారా లిస్తున్న భద్రం ముఖం వికటంగా ఉంది. ఆలోచనలతో అలిసి కుర్చీలో కూలబడ్డాడు. ఇల్లంతా చిందర వందరగా ఉన్నది. వెంగళ్రావు పిల్లిలా వచ్చి ముందు నిలబడ్డాడు. భద్రం ముఖం వల్లికిలించింది. ఇద్దరూ ఇల్లు వదిలి చీకటిలోకి పోయేరు.

శారద పుస్తకం చదువుతూంది. నగంలో పుస్తకం ఉత్సాహంగా ఉన్నది. పుస్తకం చేత్తో పట్టుకుని కథా విధానాన్ని ఆలోచిస్తూ మంచం మీద కూర్చుంది. కామాక్షమ్మగారు పక్క గదిలో చక్కబెట్టుకుని నడుం వాల్చినట్టు అలికిడి అయింది. పుస్తకంలో ఒక్కొక్క మనిషి గురించీ ఆలోచిస్తూంది. మధ్య మధ్య గోఖలే



శివపార్వతులు
(శిల్పం)
ఫోటో—లేపక్ష అప్పారావునాయుడు
(కటక్-1)

కనిపిస్తున్నాడు. వెంగళ్రావు, భద్రం తన గది వైపు వస్తున్నట్టు చూచింది. అమ్మ గదిలోకి వెళ్ళి లేపింది. ఇద్దరూ తన గదిలోకి వచ్చేరు. శారద నమస్కారమంది.

వెంగళ్రావు, భద్రం ఎదురుగా నవ్వుతున్నారు ముసి ముసిగా.

'ఏమైనా పనుందాండి?' శారద మెల్లిగా అడిగింది.

'ఏముంది? ఈ ఊరు వచ్చినతరవాత ఎట్లా ఉంది? బడి అభివృద్ధి అయేటట్టుందా....' భద్రం అంటున్నాడు.

మధ్యలో వెంగళ్రావు—'ఈ బడీ గిడీ అన్నీ ఆయన చలవవల్లే ఈ ఊరికి వచ్చేయి. మునలి పంతులు పాత బడి ఏమీ బాగుండలేదని మళ్ళీ కొత్త బడి పెట్టించేరు....' భద్రం ఏదో అడ్డు తగిలినట్టు బాధపడ్డాడు.

'స్కూలుకు ఆగస్టు 15 ఉత్సవం బాగా చేయించాలి.'

'హెడ్మాస్టరుతో చెప్పండి....' అన్నది భయంగా.

'ఆ.....వాడి కేం తెలుసు నిద్రమొగం? ఈ రోజుల్లో ఉత్సాహంగా చురుగ్గా పని చేయగలిగేవాళ్ళే కావాలి....'


శారద మళ్ళీ మాట్లాడలేదు. వాళ్ళిద్దరికీ మాటలు తట్టలేదు. కామాక్షమ్మగారు—'పిల్లకేం తెలుసు చెప్పండి, నాలుగు ముక్కలు బళ్ళో చెప్పడం తప్ప? మీరు పెద్ద మాస్టారుతో ఆలోచించండి...'అని ముక్తసరిగాఅనేసింది. వెంగళ్రావుకు ఎందుకో భయం కంపించేస్తూంది. ఒళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్టుంది. తన బోళా కబుర్లు భద్రం నిజంగా నమ్మేసేడేమోనని భయంతో తొందరగా గడప దాటేయాలని బాధపడ్డాడు.

'సరే వెళ్దాం రండి...' అని భద్రం చేయి పుచ్చుకున్నాడు. వెంగళ్రావును తరిగేయాలన్నంత కోపం వచ్చింది. కాని అక్కణ్ణించి తప్పుకోక తప్పలేదు. దారిలో వెంగళ్రావును నోటి కొచ్చినవన్నీ తిట్టి పంపేడు.

శారద భయంతో నిండిపోయింది. మంచం మీద వాలింది. రాహువు పట్టి వదిలిన చందమామను చూచినంత సంతోషమయింది. అమ్మ కొంతసేపటికి నిశ్చింతగా గురకలు తీస్తూంది. శారద మళ్ళీ పుస్తకం తీసింది. ఒక్క అక్షరం కూడ అర్థం కాలేదు. మనస్సు అచేతనమయింది. వాళ్ళు వెళ్ళి అరగంట అయింది. తలుపువేసి నిద్రపోదామనుకుంది. పుస్తకం మూసి తలుపు మూయడానికి వెళ్ళింది—ఎదురుగా భద్రం కనిపించేడు! శారద ప్రాణం ఎగిరిపోయింది.

లోపలికి వచ్చి కూర్చున్న భద్రం ముఖంలో ఉద్రేకం ద్యోతకమవుతూంది. శారదకు గట్టిగా అరవాలనిపించింది.

'మా అమ్మను పిలుస్తాను....' అని భయంగా తత్తర పడుతూ కదలబోయింది. భద్రం



అద్దాల భవనం
(తుంగభద్ర డామ్‌సైట్)
ఫోటో—ఎస్ మల్లికార్జునరావు (నిమ్మకుర్రు)

నవ్వుతూ ఎదురుగా నిలబడ్డాడు.

ఆమె పైట కొల్లబోయింది. పెనగులాడింది. అరిచింది. కామాక్షమ్మ అదటుగా లేచి 'దొంగ.....దొంగ.....' అని అరిచింది, ఎవరో వ్యక్తి పారిపోతూండడం చూచి.

శారద కుప్పలా కూలి ఏడుస్తూంది. జనం ఒకళ్ళ తరవాత ఒకళ్ళు పోగవుతున్నారు. 'ఎవరా దొంగ.....?......' ఒక గొంతు.

'దొంగ కాదు దొరే....' మరో గొంతు. శారద భరించలేకపోయింది. ఊళ్ళో అందర్నీ తిట్టాలని ఉద్రేకం పిచ్చిరేగిపోయింది. చూస్తున్న జనాన్ని నరికివెయ్యాలన్న కోపం, నిస్సహాయతా మతి పోగొట్టాయి—

'మీకు చెల్లెళ్ళు లేరు, అక్కల్లేరు, తల్లుల్లేరు...ఈ ఊరు...పదే పదే పిచ్చిగా గావు కేకలు వేస్తూంది.కొంతమందిజనంజారుకున్నారు.సీతమ్మగారు గుంపులోంచి లోపలికి వచ్చింది. కామాక్షమ్మ శారదను పట్టుకుని ఏడుస్తూంది. సీతమ్మగారిని చూడగానే శారద వృవ్హాతప్పి పడిపోయింది. ఆమె శారదను చాల సేపు ఓదార్చింది. మూగిన గుంపును వెళ్ళమని కసిరింది. కామాక్షమ్మ కథనాన్ని బట్టి అక్కడి పరిస్థితంతా అర్థమయింది.

'శారదా, తప్పు కదూ ఇలా బాధపడ్డం? నేనున్నంతవరకూ నిన్ను ఎవరూ ఏం చెయ్యలేరు. ధైర్యం ఉండాలమ్మా. ఇలా మతి చెడగొట్టుకునేం ప్రయోజనం? మంచివాళ్ళకు భయ మేమిటి? నే నిప్పుడే విషయం బాగా తెలుసుకు వస్తాను' అంటూ లేచి వెళ్ళింది.

ఏటు తప్పిన మృగంలా ఉంది భద్రం ముఖం విధం చెడినా ఫలితం దక్కలేదని. రేపటి ఫలితానికి తనమీద ఎంత ప్రభావ ముంటుందో అనే ఆలోచన పెనవేసుకుని ఆలోచిస్తూంది తల. ఉద్రేకంతో ఊగిపోతున్నాడు. ఎదురుగా తలుపు తెరుచుకుంది. ఉద్రేకం జారిపోయింది.

'ఇంత రాత్రి ఏమిటి ఆలోచిస్తున్నావ్ భద్రం!' అన్నది ఆ మూర్తి.

'రండి సీతమ్మగారూ....ఇలా వచ్చేరేం...' తత్తరబడ్డాడు.

'నీకు ఆలోచించడం తెలీదు. అందుకే తికమక పడుతున్నావని తెలుస్తూంది. శారద ఇంటికి ఎందు కొచ్చేవ్?' ఒక్క కేకతో ప్రశ్నించింది.

'క్షమించండమ్మా. ఏదో అయిపోయింది...'

'ఏమైంది? నీ కెందు కింత మూర్ఖత్వం పుట్టుకొచ్చింది? నీ భార్యను పిలువు తొందరగా.'

'క్షమించండి. దానికి తెలిస్తే మరీ బాగుండదు.....వెంగళ్రావు మాటలు విని...'

'ఏమి చెప్పేడో నాకు తెలుసు. ఆ దరిద్రుడికి కనిపించిన ఆడుపిల్లమీద నాలుగు మాట లల్లి చెప్పడం అలవాటు....మరి నీ మతి ఎక్కడికి పోయింది? వాగినవాడి మాట లల్లా నమ్ముతావా? విచక్షణా జ్ఞానం లేనివాడివి నాయకుడివి కూడ కావాలని అనుకుంటున్నావు. ఇన్నేళ్ళు గడిచినా బ్రతుకంటే, కనిపించే ప్రతి మనిషిమీద ఎత్తుగడలు వేయడమేనని నేర్చుకున్నావు గాని, మరొక్కళ్ళను కూడ బ్రతకనివ్వడం, బ్రతకడానికి సాయపడ్డ మనేది తెలియదు. నువ్వెందుకు పనికొస్తావు భద్రం?....'

భద్రానికి ఒళ్ళంతా చీము పట్టినట్టు బిడియపడ్డాడు.

'వెంగళ్రావు శారదమీద చేస్తున్న ప్రచారం నాకూ తెలుసు. కాని ఆలోచించే జ్ఞానం అక్కర్లేదూ? ఇప్పుడే మీ అమ్మ ఉంటే చీరి చెండాడేది....'

మినుకు మినుకుమని తల వంచుకు చూస్తున్నాడు భద్రం. 'మీ నాయనకు కూడ ఇంటిని గురించి ఆలోచించడమే చేతకాలేదు. బయట పల్లకీల మోతకోసం తాపత్రయ పడేవాడు. అందుకు అక్రమంగా ఆస్తి సంపాదించేడు. ఏం లాభం? నువు చిన్నపిల్లాడప్పుడు, మీ అమ్మ పాలేరు వాడికి ఆప్యాయంగా అన్నం బెట్టేదని, కథలల్లి చెప్పినవాడి మాటల్లా విని ఆ ఇల్లాల్ని నానా హింసలూ పెట్టేడు చచ్చేవరకూ. నాకంటే పెద్దదయినా నేను చెప్పిన మాటలు విన్నది. తాను బ్రతకాలనే ఆశ పోగొట్టుకుంది. కాని నిన్ను పెంచి పెద్దవాడుగా చూడాలనే మమతతో కొంత కాలం గడిపింది. నీలాంటి నీచులు కూర్చిన అవమానం భరించలేక బావే శరణ్యం చేసుకుంది. ఈ రోజు అనుకుంటున్నాను—నీలాంటి కొడుకుని చూచి కుమిలి చచ్చేకంటే ఆ ఆత్మహత్య ఆవిడకు మేలు చేసింది. నీ విక ఎవరికి నాయకుడవై బుద్ధులు నేర్పగలవో చూడాలని ఉంది భద్రం......' నెమ్మదిగా అంటూంది సీతమ్మగారు. మంచుకొండలు జారి విరిగి నెత్తిన పడి పట్టుంది భద్రానికి.

'ఇక ఊరుకోండమ్మా....' ఏడ్చేడు భద్రం.

'నువ్వెంత తప్పు చేసినా మళ్ళీ నీలో మీ అమ్మ కనబడుతుంది భద్రం నాకు. కాని ఆవిణ్ణి తలంచడానికి కూడ అర్హత పోగొట్టుకున్నావు.'

అంతవరకూ వెనక ఉన్న భద్రం భార్య ముందు కొచ్చింది. ఏమో అనాలనుకున్న భద్రం నోటికి తాళంపడింది.

'వీరికి ఎన్నోసార్లు చెప్పేను పిన్నిగారూ. ముతాలో చేరద్దని చెవి నిల్లు కట్టుకుని చెప్పేను. చెవి కొరికిన మనిషినల్లా నమ్మి, ఏదో వెలగబడతానని ఇలా బోర్లపడ్డారు....'

లింగం ఉద్వేగంతో లోపలికి వచ్చేడు.

లింగాన్ని చూడగానే, ఇక ఏం జరుగుతుందో నన్నబాధ గుండెల్లో గుభేలు మన్నది. ఎన్నిసార్లు క్రరతో బాదుతా నన్నాడు? ఈ రోజు ఆ పని కాస్తా జేస్తే దిక్కేమిటి? భద్రం బిక్కపోయి నిలబడ్డాడు.

'శారదమ్మగోరు ఎక్కడి కెళ్ళేరో కనిపించడం లేదు. అయ్యగారు వెదకడాని కెళ్ళేరు. రండమ్మగారూ...' అని కంగారు పడుతున్నాడు.

'భద్రం, ఆత్మ పూరించిన శంఖారవం విని నడుచుకోగలవాడు క్షేత్రజ్ఞుడు. ఈ మాత్రం తెలియనివాడవు ఈ దేశంలో నాయకుడవని నిలబడ్డానికి అర్హతే లేదు. భద్రంగా బ్రతకడం నేర్చుకో.....అంతే చాలు.' సీతమ్మగారు వెళ్ళిపోయింది. వెంట లింగం వెళ్ళిపోయేడు. భద్రం మొదలంట కూలబడ్డాడు.

ఊరి వెలుపలి మామిడితోట అంచున మోటు బావి చీకటిలో మొరడుబారిన మనిషిలా ఉంది. చుట్టూ కదలిక కనిపించింది. తోట మధ్యగుండా గోఖలే పరుగెత్తేడు.

ఏకాంతంగా బావిలోకి చూస్తూ బెక్కుతూ ఏడుస్తూంది శారద. వెనుక నడిచిన శబ్దం ఎండుటాకుల గల గల విని స్తబ్ధపడింది శారద. ఎదురుగా గోఖలే నిలబడ్డాడు. గట్టిగా ఏడ్చింది.

'నన్ను ముట్టుకోకండి....' పిచ్చిగా అరుస్తూంది.

'ఇంత చిన్న విషయానికి ఇంతవరకూ ఎందుకు వచ్చేవు? మనస్సులో బాధ బావిలో పడితే పోయేదా? సొంతం ఆలోచించే మనోధైర్యం లేకపోతే నీలాంటివాళ్ళు ఎందర్నో పిరికివాళ్ళను తయారు చేస్తారు.....'

'నే నెవరి ముఖం చూడగలను...'

'అంత తప్పు ఏం చేసేవు శారదా...'శారదకు ఏమీ సమాధానం దొరకలేదు. మౌనంగా చూస్తూ కూర్చుంది.

'దీనికేనా ఇంత బాధ పడేది? నాకంతా తెలుసు. లేని పోని మాటలు కల్పించే పోచుకోలు రాయుళ్ళు, సోమర్లూ సంఘంలో చాలమంది ఉన్నారు. వాళ్ళ మాటలు నమ్మే బోళాలు తాళం వేయడానికి చాలమంది ఉంటారు. వీళ్ళు బుద్ధి తెచ్చుకునేవరకూ సంఘంలో బ్రతుకు ఇలానే ఉంటుంది. అలాంటి వాళ్ళకు బుద్ధి చెప్పడం నేర్చుకోవాలి గాని, ఇలా పిరికిబడి నుయ్యో గొయ్యో చూచుకోడం బుద్ధిమంతుల లక్షణం కాదు. రా వెళ్దాం....'

శారదలో ఏదో ఉత్తేజపరిచింది. జీవితంమీద జిగీష మెరిసింది. గోఖలే కాళ్ళమీద వాలిపోయింది బరువైన గుండెలతో. గోఖలే లేవనెత్తేడు. అతడి కళ్ళల్లో వెలుగు చూడాలనే ఆకాంక్షతో చూచింది. చీకటిలో శారద కళ్ళల్లో గోఖలే మెరిసిపోయేడు.

గోఖలే శారద చేయిపట్టి ముందుకు నడిపించేడు. పెళ్ళికూతుర్లా వంగి అడుగులో అడుగులు వేస్తూ నడుస్తూంది. పక్షులు కిలకిలమని నవ్వుతున్నాయి. తూరుపు తెలవారింది. ★